## క్లుప్తంగా

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ధర్మవరం రూరల్:** పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డీడీ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో మార్చి 1 నుంచి 31 వరకు పశువులకు ఉచితంగా టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు నిండిన ప్రతి పశువుకూ టీకా వేయించాలన్నారు.

### గంగమ్మకు ప్రత్యేక పూజలు

**తాడిమర్రి:** స్థానిక గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ దేవతకు, బొడ్రాయికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. రజక సామాజిక వర్గానికి చెందిన భక్తులు ముందుగా పూజా సామాగ్రి గంపలను నెత్తిమీద ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయిని అలంకరించి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

### సీఐకి ఘన సన్మానం



సీఐ మన్సూరుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**బత్తలపల్లి:** ఫోరెన్సిక్, మెడిసిన్ పరీక్షల్లో సీఐ మన్సూరుద్దీన్‌కు దక్కిన సిల్వర్ మెడల్ ఉమ్మడి అనంతపురం జిల్లాకే గర్వకారణమని ధర్మవరం టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాష, బత్తలపల్లి, ధర్మవరం రూరల్ ఎస్ఐలు టీవీ శ్రీహర్ష, ప్రదీప్ కొనియాడారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మన్సూరుద్దీన్‌కు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏఎస్ఐలు ఖాశీం, సోమశేఖర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీపీగా వెంగళరెడ్డి ప్రమాణ స్వీకారం



వెంగళరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీడీఓ సాయిమనోహర్

**బత్తలపల్లి:** బత్తలపల్లి ఎంపీపీగా దంపెట్ల ఎంపీటీసీ సభ్యుడు గజ్జెల వెంగళరెడ్డి ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాయిమనోహర్ వెంగళరెడ్డితో ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

### అభినందన

**కొత్తచెరువు:** రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరచి ద్వితీయ బహుమతి సాధించిన లక్ష్మీనరసింహ అనే విద్యార్థిని మంగళవారం ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి అభినందించారు. గైడ్ టీచర్ జయశంకర్‌ను కూడా అభినందించారు.

### గ్రామీణాభివృద్ధే లక్ష్యం

**ధర్మవరం రూరల్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు విరివిగా రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి పాటుపడడమే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ముఖ్య ఉద్దేశమని ఏపీజీబీ జీఎం జగదీశ్వరరావు, ఆర్ఎం రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏపీజీబీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ చందన, క్యాషియర్ అంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

**బత్తలపల్లి:** మానవాళి అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమైందని ఎంఈఓ చాముండేశ్వరి అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులు, నమూనాలతో పాటు ప్రయోగాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు మల్లేసు తదితరులున్నారు.

# కష్టాలు తీర్చిన 'గడప గడప'



ఇది నల్లమాడ మండలం పెమనకుంటపల్లి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని పాయకట్ట చెరువు వరకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నూతనంగా నిర్మించిన మట్టిరోడ్డు. గతంలో ఈ మార్గంలో అడుగడుగునా గుంతలు, బండ రాళ్లు, కంపచెట్లు ఉండేవి. దీంతో రైతులు నానా అవస్థలు పడేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇటీవల పెమనకుంటపల్లిలో పర్యటించగా, ఆయన దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.5 లక్షలు మంజూరు చేస్తూ పాయకట్ట చెరువు వరకు మట్టి రోడ్డు నిర్మించాలని పంచాయితీ రాజ్, ఉపాధి హామీ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఇదిగో ఇలా రోడ్డు నిర్మితమైంది.

- రూ. 7.28 కోట్లతో గ్రామాల మధ్య లింక్ రోడ్లు, పొలాలకు మట్టిరోడ్లు
- తీరిన రైతుల కష్టాలు.. పెరిగిన భూముల విలువ

**నల్లమాడ:** పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ నిధులు రూ.7.28 కోట్ల వ్యయంతో 82 కిలోమీటర్ల మేర మట్టి రోడ్లు మంజూరయ్యాయి. చారుపల్లి పంచాయతీలోని పోలంవాండ్లపల్లి నుంచి ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి సమీపంలోని సోలార్ ప్లాంట్ వరకు, యర్రవంకపల్లి పంచాయతీ కేంద్రం నుంచి మజరా గ్రామం మీసాలవాండ్లపల్లి వరకు లింక్ రోడ్డు, యర్రవంకపల్లి సమీపంలోని మారెమ్మ గుడి వద్దనుంచి యర్రప్పచెరువు వరకు మట్టిరోడ్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇదివరకే సోలార్ ప్లాంట్ నెలకొల్పడానికి తోడు మట్టి రోడ్డు నిర్మాణంతో మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడి తమ భూముల విలువ మరింత పెరిగినట్లు పోలంవాండ్లపల్లి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అడిగిన వెంటనే రోడ్డు మంజూరు చేసి, తమ కష్టాలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తీర్చారని వారు కృతజ్ఞతలు చెబుతున్నారు.

| మండలం | మొత్తం కిలోమీటర్లు | మంజూరైన మొత్తం నిధులు (రూ.లక్షల్లో) |
|---|---|---|
| నల్లమాడ | 25 | 215 |
| ఓడీ చెరువు | 18 | 162 |
| అమడగూరు | 15 | 135 |
| కొత్తచెరువు | 14 | 126 |
| బుక్కపట్నం | 10 | 90 |

#### లింక్ రోడ్లను పునరుద్ధరిస్తాం



ప్రాధాన్యతాపరంగా గ్రామాల మధ్య లింక్ రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రైతులకు ఇబ్బందులు లేకుండా పొలాలకు వెళ్లే దారులను కూడా మరమ్మతు చేయిస్తున్నాం. ఇప్పటికే 82 కిలోమీటర్ల మేర మట్టి రోడ్ల నిర్మాణానికి రూ.7.28 కోట్లు మంజూరు చేశాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్నదే మా ఉద్దేశం.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే

#### దశాబ్దాల కల నెరవేరింది



పాయకట్ట చెరువు చుట్టూ సుమారు వందమంది రైతులం 500 ఎకరాల్లో మామిడి తోటలు సాగుచేసి జీవనం సాగిస్తున్నాం. 40 ఏళ్ల నుంచి సరైన రహదారి లేకపోవడంతో మామిడి కాయలను తరలించేందుకు నానా కష్టాలు పడేవాళ్లం. ఇప్పుడు 40 అడుగుల వెడల్పుతో మట్టి రోడ్డు ఏర్పాటు చేయడంతో దశాబ్దాల కల నెరవేరింది. అడిగిన వెంటనే రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి మేం ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గోవిందరెడ్డి, రైతు, పెమనకుంటపల్లి

### వృద్ధులకు అన్నదానం

**తాడిమర్రి:** మండలంలోని నార్సింపల్లి వృద్ధాశ్రమంలో తాడిమర్రికి చెందిన బొసెట్టి రామాంజినేయులు మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఆయన తన కుమారుని పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి, వారితో సంతోషాన్ని పంచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**ఓడీ చెరువు:** మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన గొల్లపల్లి నారాయణరెడ్డి (70) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని సుందరయ్యకాలనీ వద్ద కదిరి హిందూపురం రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు దాటుతున్న నారాయణరెడ్డిని ద్విచక్రవాహనం ఢీకొంది. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుమారుడు సాంబశివారెడ్డి తెలిపారు.

### గోవుల ట్రక్కు పోలీసులకు అప్పగింత

**తనకల్లు:** అక్రమంగా గోవులను ఇతర రాష్ట్రాల్లోని కబేలాలకు తరలిస్తున్న లారీ ట్రక్కును మంగళవారం కొక్కంటిక్రాస్‌లో స్థానికులు, వీహెచ్‌పీ నాయకులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. దాదాపు 50 వరకు ఆవులు, బర్రెలు (ఎనుములు) ఉండడంతో ట్రక్కును తనకల్లులోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు తరలించారు. తహసీల్దార్ మధు నాయక్, ఎస్ఐ రాంభూపాల్, వీఆర్వో విజయ్ కుమార్ మార్కెట్‌యార్డ్‌కు చేరుకొని ట్రక్కును పరిశీలించారు. కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సత్యం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**పుట్టపర్తి టౌన్:** అధైర్యపడొద్దు అండగా ఉంటామంటూ బాధితులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక 6వ వార్డు వివేకానంద రోడ్డులో శివాలయం గుడి పక్కన భైరవ సప్లయర్స్ సత్యం నివాసం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం దెబ్బతిన్న సంగతి తెలిసిందే. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మంగళవారం సత్యం కుటుంబసభ్యులను పరామర్శించారు. విద్యుత్ స్తంభం పక్కకు మార్చాలని, పట్టణంలో విద్యుత్ సరఫరా కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, సాయిగీత, చెరువుభాస్కర్‌రెడ్డి, నాయకులు జ్యోతి చంద్రశేఖర్, కత్తి మల్లిఖార్జున, బోగం మల్లి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**నివాళి**

**ఓడీ చెరువు:** డబురువారిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, బత్తినపల్లికి చెందిన నారాయణరెడ్డి (92), మల్లోళ్లపల్లికి చెందిన చింతా చెన్నారెడ్డి (85) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతులకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారి మహేందర్ రెడ్డి

**పుట్టపర్తి అర్బన్:** స్థానిక మోడల్‌స్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు 34 ఆవిష్కరణలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) జిల్లాధికారి మహేందర్‌రెడ్డి పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నల్లమాడ:** రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గణితం, సైన్స్‌కు సంబంధించి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కసుముక్కల లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమణప్ప ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శాస్త్రీయ వైఖరులను అలవర్చుకోవాలి**

**తనకల్లు:** విద్యార్థినులు శాస్త్రీయ వైఖరులను అలవర్చుకోవాలని మండల విద్యాధికారి లలితమ్మ అన్నారు. మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై నమూనాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**కదిరి అర్బన్:** స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు, సైన్స్ ప్రదర్శనలు నిర్వహించి, బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

**గాండ్లపెంట:** గజ్జలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నమూనాలు ప్రదర్శించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు షబ్బీర్‌అలీ, పద్మావతి అవగాహన కల్పించారు.

**ధర్మవరం నియోజకవర్గంలో..**

**ధర్మవరం అర్బన్:** విద్యార్థులు వైజ్ఞానిక రంగంలో రాణించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

- కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను రిటైర్డ్ హెచ్ఎం వెంకటప్ప ప్రారంభించారు. అనంతరం రూ.25 వేలు విలువ చేసే సైన్స్ మెటీరియల్‌ను సైన్స్‌ల్యాబ్ కోసం అందించారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- లయోలా ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సైన్స్ ఫేర్‌లో విండ్‌మిల్, హ్యూమన్ బాడీ పార్ట్స్, కిడ్నీలు, వాటర్ సైకిల్ నమూనాలకు బహుమతులు వచ్చాయి.
- సూర్య స్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జేవీవీ శాస్త్ర ప్రచార కన్వీనర్ ప్రసాద్ చేసిన మ్యాజిక్‌లు ఆకట్టుకున్నాయి. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, హెచ్ఎం నరేంద్ర, డైరెక్టర్ రఘు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలి**

**పుట్టపర్తి:** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని జిల్లా సర్వ శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం బుక్కపట్నం సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన జాతీయ విజ్ఞాన దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## పుణ్యకార్యంలో పాల్గొనడం అదృష్టం

- శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, ఎమ్మెల్యే సిద్దారెడ్డి




ముస్లిం సామూహిక వివాహాల్లో పాల్గొన్న డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**కదిరి అర్బన్:** పుణ్యకార్యంలా నిర్వహిస్తున్న నిరుపేద ముస్లింల సామూహిక వివాహాల్లో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఖ్వాజీ అబ్దుల్‌మన్నాన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింల సామూహిక వివాహాలు జరిగాయి. కార్యక్రమానికి శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంతో పాటు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకులు పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఒక్కటైన జంటలకు అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి పుణ్యకార్యాల్లో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 12 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పరికి సాదిక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


### గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



శ్రీనివాసులు(ఫైల్)

**ఎన్‌పీకుంట:** గుండెపోటుతో ఉపాధికూలీ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని గెంగినాయునిపల్లిలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన మేరకు.. గెంగినాయునిపల్లి హరిజనవాడకు చెందిన మేకల శ్రీనివాసులు (30) మంగళవారం ఉదయం గ్రామ సమీపంలో ఉపాధిహామీ కూలి పనికి వెళ్లాడు. పని చేస్తుండగా గుండెలో నొప్పి వస్తోందని అక్కడి నుంచి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వైద్యసేవల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

### సంక్షేమ సారథి వైఎస్ జగన్



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

**ముదిగుబ్బ:** అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి పొందారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 2,3 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రాయుడు, భాస్కర్, కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

**నల్లచెరువు:** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని అల్లుగుండు, పీ. కొత్తపల్లి, ఎస్. ములకలపల్లి గ్రామ సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని గ్రాడ్యుయేట్స్ ఓటర్లను గుర్తించాలన్నారు. మార్చి 13 నుంచి కొత్తగా ఎన్నికైన గృహ సారథులకు మెటీరియల్స్ అందజేస్తామని, వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఇంటి యజమాని అనుమతితో డోర్లకు జగనన్న స్టిక్కర్లను అతికించాలని పేర్కొన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోనూ చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, డైరెక్టర్ నాగముని, నాయకులు సుధాకర్‌రెడ్డి, జిలాన్‌బాషా, కే. రమణారెడ్డి, హైటెక్ రమణనాయక్, అంజినప్ప, విశ్వనాథ్‌రెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోవిందురెడ్డి, గోవిందప్ప, వేమారెడ్డి, కుళ్లాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి , యుగంధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కార్యకర్తలకు పరామర్శ**

చెవిటివారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త యశ్వంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స చేయించుకొని ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి మంగళవారం అతన్ని పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన బుడ్డా నరసింహులు వెన్నెముకకు ఆపరేషన్ చేయించుకున్నాడని తెలియడంతో అతనితో మాట్లాడారు.

**గాండ్లపెంట:** కొట్లపల్లి గ్రామానికి చెందిన చౌక దుకాణ డీలర్ అప్పిరెడ్డి నాగిరెడ్డి (63) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మంగళవారం మృతుని స్వగ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మండల బూత్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఉన్నారు.

**ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన**

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఈ నెల 3,4వ తేదీల్లో జరిగే ఇస్తెమాకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పరిశీలించారు. ముస్లిం సోదరులు ప్రశాంతంగా కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు తన సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికి సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టండి

**కనగానపల్లి:** సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సామాజిక తనిఖీ బృందానికి సూచించారు. మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టేందుకు వచ్చిన సామాజిక బృందం సభ్యులు, ఉపాధిహామీ సిబ్బందితో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీలు చేపట్టే పనుల వివరాలు తెలిపే రికార్డులను బృందం సభ్యులకు అందజేశారు. సామాజిక తనిఖీలో అనుసరించే విధానాలపై బృందం సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఏపీఓ సుధాకర్, ఈసీ సాయినాథ్ తదితరులున్నారు.

## సంక్షిప్త సమాచారం

**విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీ**

**తలుపుల:** భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిబావంతులకు మంగళవారం ఐఈఆర్టీ భారతి ఆధ్వర్యంలో ఎంఈఓ వెంకట్రాముడు పరికరాలు పంపిణీ చేశారు. ఫిజియోథెరపీ వైద్యులు రామమోహన్, ప్రధానోపాధ్యాయులు శంకర నారాయణరెడ్డి, సీఆర్‌పీ నీలాకుమార్ పాల్గొన్నారు.

**చెన్నేకొత్తపల్లి:** దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ కృష్ణ మోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని భవిత కార్యాలయంలో దివ్యాగుల ట్రైసైకిల్ ఉపకరణాలను పంపిణీ చేశారు.

**ధర్మవరం అర్బన్:** లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఎంఈఓ సుధాకర్‌నాయక్, కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ పరికరాలు పంపిణీ చేశారు. హెచ్ఎం నాగప్ప, ఉపాధ్యాయులు రమాదేవి, సరస్వతి, శ్రీలత, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**యువకుడి మృతి**

**కదిరి అర్బన్:** ఎగువపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురైన సున్నపుగుట్టతండాకు చెందిన రహంతుల్లానాయక్ (37) చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి రామక్కబాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

**గాండ్లపెంట:** గాజులవారిపల్లి పెద్దతండా పంచాయతీ కల్లుబావితండాలో ఆర్డీటీ ఆధ్వర్యంలో 20 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. పునాదులు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.61 వేల చొప్పున 20 మందికి రూ.12.20 లక్షలను రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ మంగళవారం పంపిణీ చేశారు.

**సిమెంట్ పంపిణీ**

**నల్లమాడ:** దొన్నికోట పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు మంగళవారం సర్పంచ్ రాగినేని సరస్వతి ఆధ్వర్యంలో 1,605 సిమెంట్ బస్తాలు పంపిణీ చేసినట్లు హౌసింగ్ ఏఈ వరుణ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజునాయుడు, కమలాకర్‌నాయుడు, వెంకటశివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా టైలర్స్ డే**

**నల్లచెరువు:** గీతామందిరంలో మంగళవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టైలర్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు ముస్తఫా, గౌరవ అధ్యక్షుడు అంజినేయులు,టైలర్లు విజయ్‌కుమార్, తదితరులున్నారు.

**భక్తిశ్రద్ధలతో హోమాలు**

**ధర్మవరం అర్బన్:** తొగటవీధిలోనున్న శాంతకళ చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం వేదమంత్రాల నడుమ హోమాలు నిర్వహించారు. మార్చి 2 వరకూ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**పౌరహక్కుల దినోత్సవం**

**గాండ్లపెంట:** సోమయాజులపల్లి దళితవాడలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి నిర్వహించారు. హెచ్‌సీ రామయ్య, కానిస్టేబుల్ భాస్కరరాజు పాల్గొన్నారు.

**అత్యుత్తమ ప్రతిభ కనబరచాలి**

**ఎన్‌పీకుంట:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాద్రి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు.

**వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం**

**చెన్నేకొత్తపల్లి:** గంగినేపల్లికి చెందిన వలంటీర్ నాగరాజు గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. బాధిత కుటుంబానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అండగా నిలిచారు. మంగళవారం రూ.32 వేలు నగదు అందించారు. పంచాయతీ కార్యదర్శి రాము, వీఆర్ఓ కదిరప్ప, సిబ్బంది, తదితరులున్నారు.

**భక్తిభావం నింపిన భాగవత ప్రవచనాలు**

**పుట్టపర్తి టౌన్:** స్థానిక చిత్రావతి హారతీ ఘాట్ వద్ద మంగళవారం కొండపాక రంగచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భాగవత ప్రవచనాలు స్థానికుల్లో భక్తిభావం నింపాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

**చికిత్స పొందుతూ యువకుడి మృతి**

**ముదిగుబ్బ:** తప్పెటవారిపల్లికి చెందిన చంటి (32) అనే యువకుడు మంగళవారం కడప ఆస్పత్రిలో మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం పొలంలో పొలం పనులు చేస్తుండగా ఆయన పాము కాటుకు గురయ్యాడు.

**గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు**

**ధర్మవరం అర్బన్:** గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రాజా హెచ్చరించారు. గూడ్స్‌షెడ్‌కొట్టాలలో మంగళవారం రాత్రి ప్రజలతో సమావేశం నిర్వహించారు.